కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ధర్నా



నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా మున్సిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. నెల్లూరు కార్పొరేషన్లో 93 మంది కార్మికులను అర్ధాంతరంగా తొలగించారని ఆరోపించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ నందన్, మేయర్ స్రవంతికి సమ్మె నోటీస్‌ను అందజేశారు. నేతలు కొండా ప్రసాద్, శివాజీ, కృష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు శ్రీనివాసులు, సునీల్, దేశమూర్తి, లోకేశ్, వజ్రమ్మ, భారతి, మారుతి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు కృషి



నెల్లూరు(అర్బన్): జిల్లాలో కీటక జనిత వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని సబ్ యూనియన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫీవర్, లార్వా సర్వేలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. మురుగునీటిలో దోమలు ఉత్పత్తి కాకుండా ఆయిల్‌బాల్స్‌తో పాటు గంబూసియా చేపలను వదలాలని కోరారు. మలాథియాన్‌ను స్ప్రే చేయాలని పేర్కొన్నారు. మలేరియా సహాయాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని బాగా చూసుకోమన్నందుకు దాడి

నెల్లూరు సిటీ: తల్లిని బాగా చూసుకోవాలని సూచించిన సోదరుడితో పాటు అతని ఇద్దరి స్నేహితులపై దాడికి పాల్పడిన ఘటన సౌత్‌మోపూరులోని మొగళ్లపాళెం రోడ్డులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. సైదాపురం మండలం కృష్టారెడ్డిపల్లెకు చెందిన కుంచెం అంకయ్య కొత్తూరులోని వల్లూరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. సొంతూళ్లోని తన సోదరుల వద్ద తల్లి ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమెను సక్రమంగా చూడటంలేదనే సమాచారంతో అంకయ్య తన స్నేహితులు హరి, శ్రీనుతో కలిసి అక్కడికి వెళ్లారు. సోదరులను మందలించి తిరిగెళ్లసాగారు. ఈ తరుణంలో పొదలకూరు రోడ్డు నుంచి మొగళ్లపాళెం వెళ్లే కూడలి వద్ద కారులో ఆగి ఉండగా, సోదరులు వచ్చి అంకయ్యతో పాటు హరి, శ్రీనుపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవలను దృష్టిలో పెట్టుకొని..

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై కొందరు దాడికి పాల్పడిన ఘటన వెంగళరావునగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన ప్రభుకు అదే ప్రాంతానికి చెందిన వాసుతో గొడవలున్నాయి. ఈ క్రమంలో తన మేనత్త మేరీ ఇంటికి ప్రభు వెళ్లారు. ఇంతలో అక్కడికి చేరుకున్న వాసు, అతని కుటుంబసభ్యులు, బంధువులు.. ప్రభుపై దాడిచేసి గాయపర్చారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్చరిక నోటీసు

ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా నా క్లయింట్స్ అయిన **యెందోటి దిలీప్ తండ్రి రామచంద్రా రెడ్డి, యెందోటి స్వరూప్ తండ్రి రామచంద్రా రెడ్డి** కనుపర్తిపాడు. గ్రామం, నెల్లూరు రూరల్ మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అను వారల సంజాయిషి మేరకు నా క్లయింట్సు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి **1. పాలకొండ భవాని భర్త ప్రశాంత్ రెడ్డి, 2. కాటంరెడ్డి వరందామరెడ్డి తండ్రి చెంచురెడ్డి, 3. కాకుటూరు లక్ష్మణ రెడ్డి తండ్రి విజయమోహన రెడ్డి, 4. పాలకొండ సుబ్బారెడ్డి తండ్రి రామిరెడ్డి 5. పొన్నవోలు మధుసూదన రెడ్డి తండ్రి వెణుగోపాల్ రెడ్డి 6. యాటపు రమాదేవి భర్త వేముల రెడ్డి 7. గణవం హరితారెడ్డి తండ్రి సుదర్శన రెడ్డిల పై డిక్లరేషన్ మరియు డెలివరీ ఆఫ్ పొసెషన్ కోరుతూ నెల్లూరు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు O.S.No.80/2024 అను దావా దాఖలు చేసియున్నారు.** సదరు దావాలో **I.A.No. 629/2024** నెంబరు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను అన్యాక్రాంతము చేయకుండా **ఇంజక్షన్ ఆర్డర్ పొందివున్నారు. సదరు దావా పెండింగ్‌లో వున్నది.** కాని ప్రతివాదులు ఇతరులతో కలిసి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను ఇతరులకు అమ్ముమాపుటకు ప్రయత్నించుచున్నారు అని తెలిసినది. ఈ ఆస్తులను ఎవ్వరైన కొన్న యెడల మరియు ఎటువంటి లావాదేవిలు జరిపిన యెడల చట్టరీత్యా చెల్లనేరదు. అట్లు జరిపినచో నా క్లయింట్స్ తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఈ హెచ్చరిక నోటీసు ద్వారా తెలియచేయడమైనది.

PETITION SCHEDULE

ITEM NO. 1 :- SPSR Nellore District, Buja Buja Nellore Sub-Registration, Nellore Rural Mandal, Kanuparthipadu Village and Panchayat, Sy. No. 410 in an extent of Ac. 0-37$^1/_2$ cents or 226.875 ankanams or 1815 sq.yards of site out of Ac. 1-50 cents within the following boundaries; **East** : Layout road, **South** : Property belonging to Yendoti Pradeep, **West** : Road, **North** : Property belonging to Vendoti Swaroop

Within these boundaries an extent of 226.875 ankanams or 1815sq.yards of vacant site and with all easement rights.

ITEM NO. 2 :- SPSR Nellore District, Buja Buja Nellore Sub-Registration, Nellore Rural Mandal, Kanuparthipadu Village and Panchayat, Sy. No. 410 in an extent of Ac. 0-37$^1/_2$ cents or 226.875 ankanams or 1815sq.yards of site out of Ac. 1-50 cents within the following boundaries; **East** : Layout road, **South** : Property belonging to Yendoti Dileep, **West** : Road, **North** : Plots situated in Vijayalakshmi layout

Within these boundaries an extent of 226.875 ankanams or 1815sq.yards of vacant site and with all easement rights.

ITEM NO. 3:- SPSR Nellore District, Buja Buja Nellore Sub-Registration, Nellore Rural Mandal, Kanuparthipadu Village and Panchayat, Sy. No. 410 in an extent of Ac. 0-50 cents of site, within the following boundaries; **East** : Layout road, **South** : Property belonging to Yendoti Pradeep, **West** : Road, **North** : Property belonging to Yendoti Swaroop

ITEM NO. 4 :- -SPSR Nellore District, Buja Buja Nellore Sub-Registration, Nellore Municipal Corporation area, Kanuparthipadu Village, Sy. No. 410 in an extent of Ac. 0-08 cents or 48 ankanamas of vacant site out of Ac. 2-58 cents, within the following boundaries; **East** : Road(this side measurement 48 ft), **South** : Vacant site of others (this side measurement 72ft), **West** : Golagamudi Road (this side measurement 48 ft), **North** : Vacant site belonging to others (this side measurement 72ft)

Within these boundaries an extent of 48 ankanams of the vacant site and with all easement rights.

CH. Naveen, B.Com, LLB.
Advocate, Nellore.
Cell No : 94400 29472

వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితం

- దిగొచ్చిన కూటమి సర్కార్
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉపాధ్యాయుల బదిలీల్లో తీసుకొచ్చిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానంతో 50 వేల మంది ఎస్టీటీలు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తెచ్చి జరిపిన పోరాటం సత్ఫలితాన్ని ఇచ్చిందని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ ఏకతాటిపై నిలిచి సమష్టిగా చేసిన పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం దిగొచ్చి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అంగీకారం తెలిపిందన్నారు. దీనిపై తమ పార్టీ చేసిన పోరాటం అందరికీ తెలిసిందేనన్నారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయులకు అండగా ఉంటామన్నారు. వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఏకేనగర్ బ్రాంచ్‌లో జ్యువెల్ అప్రైజర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ క్రమంలో రూ.1.2 లక్షలను బ్యాంక్ జ్యువెల్ అప్రైజర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ నేపథ్యంలో ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మృతుడి భార్య సుకన్యకు రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. వెంకట్రామాపురంలోని ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ జేఏయూ అధ్యక్షుడు కుర్చేటి శ్రీనివాస ఆచారి, యూనియన్ జనరల్ సెక్రటరీ రాఘవేంద్ర ఆచారి, సీనియర్ మేనేజర్ బాలాజీ, బీవీనగర్ బ్రాంచ్ అప్రైజర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్‌లో ఖాళీల భర్తీ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో కీలకమైన పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో పలు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో ముగ్గురు అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. నుడా కార్యాలయంలో సీపీఓగా ఉన్న హిమబిందును సిటీ ప్లానర్‌గా నియమించారు. మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న రఘునాథరావును అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా, బద్వేల్ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న సతీష్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

పురస్కారాల ప్రదానం నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను బుధవారం అందజేయనున్నామని కన్వీనర్ బుధవరపు బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైపాడు రోడ్డులోని దోనెపర్తి గిరిప్రసాద్ కల్యాణ మండపంలో కార్యక్రమం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభంకానుందని చెప్పారు.

కూచిపూడి నృత్యంపై వర్క్‌షాపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూచిపూడి నృత్యంపై వర్క్‌షాపును క్లాసికల్ కల్చరల్స్ రిసోర్స్ ఫౌండేషన్, నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని మాగుంట లేఅవుట్లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. క్లాసికల్ కల్చరల్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సంతోష్ మిత్రా, నందికేశ్వర కూచిపూడి నృత్య కళాక్షేత్ర నిర్వాహకులు చెన్నారెడ్డి బాలశ్రీకర్‌రెడ్డి, జ్యోత్స్నారెడ్డి దంపతులు, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, సావిత్రి, శరణ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీనగర్, గౌతమినగర్, ప్రగతినగర్, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మజ్జిగ ప్యాకెట్లను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, కిలారి మధుసూదన్‌రావు, తిరుపతినాయుడు, సుధాకర్‌చౌదరి, రఘురామ్ ముదిరాజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టాటా న్యూ ఆల్ట్రోజ్ కారు విడుదల



నెల్లూరు(టౌన్): కాకుటూరులోని శివశంకర్ మోటార్స్ టాటా షోరూమ్‌లో న్యూ ఆల్ట్రోజ్ కారును మార్కెట్లోకి ఎమ్వీఐ బాలమురళి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులు మాట్లాడారు. న్యూ ఆల్ట్రోజ్ కారు పెట్రోల్, డీజిల్, సీఎన్జీ వేరియెంట్లలో లభిస్తుందని వివరించారు. జెడ్‌ఎం జయదీప్‌గుప్తా, రీజినల్ మేనేజర్ గోపు, టెరిటరీ మేనేజర్ శ్రావణ్, మేనేజింగ్ డైరెక్టర్ రవి, జీఎం మురళి, మేనేజర్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

15లోపు ట్యాక్స్ రివిజన్ సర్వే పూర్తి

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వేను ఈ నెల 15 నాటికి నూరు శాతం పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ సెక్షన్‌తో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేను ఉదయం ఆరు నుంచే ప్రారంభించి, గృహాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేసి, నివేదికలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సూపరింటెండెంట్ నరేంద్ర, రెవెన్యూ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- టౌన్‌ప్లానింగ్ మంజూరు చేసిన అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 33వ డివిజన్లోని నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. భవన నిర్మాణాలకు కొలతలేయించి, అసెస్మెంట్ డిమాండ్లతో పోల్చి చూశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి పనులను అడ్డుకోవాలని చెప్పారు. అనంతరం ఫతేఖాన్‌పేటలో జరుగుతున్న కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. ఏసీ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తకుండా రోడ్డు మార్జిన్ వ్యాపారులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వైఎమ్సీఏ గ్రౌండ్స్ సమీపంలోని రజక భవన్ ప్రాంగణాన్ని పరిశీలించారు.

అధికారుల దృష్టికి అక్రమాలు

నెల్లూరు రూరల్: నగరంలోని ప్రభుత్వ లేఅవుట్లను రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ క్రమంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను వారికి బీజేపీ నేత మిడతల రమేష్ తెలియజేశారు.



ప్రైవేట్ పాఠశాలలవైపే మొగ్గు

- ఈ నెల 12న స్కూళ్ల పునఃప్రారంభం
- దుస్తులు, స్టేషనరీ, బ్యాగుల కొనుగోలు

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. తొలి నుంచి విద్యలో అగ్రగామిగా నెల్లూరుకు పేరుంది. జిల్లాతో పాటు రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. మార్కులు, ర్యాంకులను ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులే సాధిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం స్కూళ్లను ఈ నెల 12న పునఃప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సిద్ధమవుతున్నారు. యూనిఫారంతో పాటు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీని కొనుగోలు చేసేందుకు దుకాణాల బాటపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంతో పేరు గాంచిన ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఇందులో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు సమాయత్తమవుతున్నారు.

మార్కులు, ర్యాంకులూ..

పదో తరగతిలో అత్యధిక మార్కులతో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులే సాధిస్తున్నారు. మెజార్టీ విద్యార్థులు నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియాన్ని చదివేందుకు ఇష్టపడుతున్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఎస్సీఈఆర్టీ పుస్తకాలతో పాటు సొంతంగా మెటీరియల్‌ను తయారు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. ఆయా యాజమాన్యాలు సైతం తమ పాఠశాలల్లో ఆట వస్తువులతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులను తమ పాఠశాలలవైపు ఆకర్షించేందుకు యత్నాలు చేస్తున్నారు.

రూరల్ తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం మంగళవారం జారీ చేసింది. ఇందుకూరుపేట తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. కాగా బాధ్యతలను బుధవారం స్వీకరించనున్నారని సమాచారం.

నేటి నుంచి వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నామని ఈఓ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నిరాశ్రయులకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానాన్ని పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాయకుడు అబ్దుల్ మాజిద్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని క్లబ్ అధ్యక్షుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు తెలిపారు. బలరామయ్యనాయుడు, అడ్వొకేట్ రమాదేవి, జయప్రకాష్, వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు పప్పునారాయణ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి హరినాథరెడ్డి, రామచంద్రయ్య, నాగేంద్ర, శీనయ్య, కుమార్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం - 1 నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం – 1 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నామని మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25642 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు ఫోన్ చేసి సూచనలను తెలియజేయాలని కోరారు.

ఆర్టీసీ డీఎంల బదిలీ

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు రీజియన్లో పనిచేస్తున్న పలువురు డిపో మేనేజర్లను బదిలీ చేశారు. నెల్లూరు – 2 డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కరిముల్లాను ఇక్కడికి.. కావలి డీఎం శ్రీనివాసులును కందుకూరుకు బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎవర్నీ నియమించలేదు.